సాక్షి
కుమురం భీం

ఆదివారం । 31 । మార్చి । 2024



ముగిసిన 'పది' పరీక్షలు

9లో▸

ఈ నెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. చివరిరోజు పరీక్ష రాసిన విద్యార్థులు ఆయా కేంద్రాల నుంచి ఆనందంగా బయటకు వచ్చారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది: 6:31	సోమ: 4:48

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /28.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పలు చోట్ల చిన్నపాటి వాన కురిసే అవకాశముంది.

సంప్రదాయమస్తు..

ప్రస్తుతం పూర్వపు పద్ధతిలోనే తమ పిల్లల వివాహాలు జరిపించేందుకే ఆదివాసీలు మొగ్గు చూపుతున్నారు. భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుత వివాహ ట్రెండ్‌ను అనుకరిస్తే సమయం వృథా కావడంతోపాటు ఖర్చులే మిగులుతుండగా ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. బాల్యవివాహాలు, కట్నకానుకల నిషేధం వైపూ అడుగులు వేస్తున్నారు. దీనిపై ఆదివాసీ పెద్దలు గ్రామాలు, గూడేల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తుండగా, నిరుపేద కుటుంబీకులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

- పాత పద్ధతిలోనే ఆదివాసీల వివాహాలు
- వేడుక ఖర్చులు తగ్గించేందుకు శ్రీకారం
- సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట
- గ్రామాలు, కులాలవారీగా సమావేశాలు
- అవగాహన కల్పిస్తున్న ఆదివాసీ పెద్దలు
- స్వాగతిస్తున్న నిరుపేద కుటుంబాలు



ఆదిలాబాద్‌లో సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్న ఆదివాసీ జంట

సండే స్పెషల్

కెరమెరి(ఆసిఫాబాద్): జల్సాలు, కట్నకానుకల జోలికి వెళ్లొద్దని, వివాహాలు నిరాడంబరంగా నిర్వహించాలని ఆదివాసీ పెద్దలు నిర్ణయించారు. కులాల వారీగా ఎక్కడికక్కడ పెద్దలు, కటోడాలు, దేవారీలతో ఆయా గూడేలు, గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఆదివాసీల్లోని తొమ్మిది కులాల్లో ప్రధానంగా గోండ్, పర్ధాన్, కొలాం, తోటి, నాయక్‌పోడ్‌కు చెందిన పెద్దలు, సర్‌మోడీలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆడంబరాలకు పోతే కలిగే కష్టనష్టాలను వివరిస్తున్నారు. సంప్రదాయ వివాహ తంతుపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పెళ్లి జరిపించాలంటే కనీసం రూ.5లక్షల నుంచి రూ.20 లక్షల దాకా ఖర్చవుతోంది. ధనవంతులు రూ.లక్షలు వెచ్చించి ఆడంబరంగా వివాహాలు చేస్తున్నారు. కొందరు పేదవాళ్లు డబ్బుల్లేకున్నా శక్తికి మించి ఖర్చు చేసి అప్పులపాలవుతున్నారు. మరికొందరు ఉన్నంతలోనే తంతు నిర్వహిస్తున్నారు. ఇలా తారతమ్యం లేకుండా అంతా ఒకే రీతిలో వివాహ తంతు నిర్వహించాలని ఆదివాసీ పెద్దలు నిర్ణయించారు. వివాహ వేడుకలో సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయాలని సూచిస్తున్నారు. అలాగే బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

తక్కువ మందితోనే నిశ్చితార్థం

గతంలో వరుడి ఇంట్లో లేదా వధువు ఇంట్లో జరిగే నిశ్చితార్థం (ఎర్రబొట్టు) కార్యక్రమానికి 10నుంచి 15మందినే పిలిచేవారు. ప్రస్తుతం ఈ కార్యక్రమానికి వందలాది మందిని ఆహ్వానిస్తున్నారు. ఇలా నిశ్చితార్థ తంతునే పెళ్లి వేడుకలా నిర్వహిస్తూ విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఈ కారణంగా వధువు కుటుంబీకులతోపాటు వరుడి కుటుంబీకులకు ఆర్థికభారం పడుతోంది. ప్రస్తుతం ఆదివాసీ పెద్దలు పాతపద్ధతిలోనే 10 నుంచి 15 మందితోనే నిశ్చితార్థం నిర్వహించాలని అవగాహన కల్పిస్తున్నారు.

వరుడు, వధువు ఒకరోజు ముందే..

వధువు ఇంట్లో వివాహం ఉంటే వరుడు, వరుడి ఇంట్లో వివాహం ఉంటే వధువు ఒకరోజు ముందే వివాహ స్థలానికి చేరుకోవాలని నిర్ణయిస్తున్నారు. ఆదివాసీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ పెళ్లి నిర్వహించాలని సూచిస్తున్నారు. వధువు లేదా వరుడితో వారి కుటుంబీకులు పెళ్లిరోజే వెళ్తే వివాహ తంతు ఆలస్యంగా జరుగుతుంది. దీంతో వచ్చిన బంధుమిత్రులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. కాగా, వివాహ వేదికగా తప్పనిసరిగా పచ్చని పందిరే వేయాలని సూచిస్తున్నారు.

వేళకు అక్షింతలు పడేలా..

ఆదివాసీల వివాహాలు సమయానికి జరగవనే ప్రచారం ఉంది. ధనవంతుడైనా.. పేదవాడైనా సమయానికి విలువ ఇవ్వరని, ఆలస్యంగా అక్షింతలు వేయిస్తారని ప్రచారంలో ఉంది. దీంతో ఇక నుంచి సంప్రదాయాలను త్వరగా ముగించేసి.. సమయానికి విలువ ఇచ్చి నిర్ణీత సమయానికే పెళ్లి తంతు ముగించాలని ఆదివాసీ పెద్దలు అవగాహన కల్పిస్తున్నారు. బంధుమిత్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచిస్తున్నారు.

కట్న, కానుకలు వద్దని..

ప్రస్తుతం పెళ్లి చేస్తున్న కుటుంబీకులు చాలా చోట్ల వివాహానికి వచ్చిన బంధువులకు కట్నకానుకలు ఇస్తున్నారు. వధువు, వరుడి కుటుంబాలు బంధువులందరికీ దుస్తులు పెట్టాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతోంది. దీంతో ఈ ప్రక్రియకు స్వస్తి పలకాలని నిర్ణయిస్తున్నారు. బంధువులే వధువు లేదా వరుడి కుటుంబ సభ్యులకు దుస్తులు లేదా నగదు కానుకలు పెడితే మంచిదని భావిస్తున్నారు. దీంతో ఇరు కుటుంబాలకు వేడుక ఖర్చు తగ్గుతుందని సూచిస్తున్నారు. వారిని ఆదుకున్నట్లు అవుతుందని చెబుతున్నారు. వివాహ వేడుకలో బ్యాండు బాజాలు వద్దని, ఆదివాసీ గిరిజన సంప్రదాయ డోలు, కాలికోమ్, సన్నాయి వినియోగించాలని కోరుతున్నారు. సంప్రదాయాన్ని చాటాలని సూచిస్తున్నారు.



జోడేఘాట్ గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆదివాసీ పెద్దలు

జిల్లాలో ఆదివాసీల జనాభా

గోండు :	70 వేలు
పర్ధాన్ :	12 వేలు
కొలాం :	30 వేలు
తోటి :	18 వేలు
నాయక్‌పోడ్ :	3 వేలు

ఖర్చులు తగ్గించేందుకే..



ప్రస్తుతం పెళ్లి వేడుక కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. పేదవారు కూడా ధనికులతో పోటీపడి అప్పు చేసి మరీ పిల్లల వివాహాలు జరిపిస్తున్నారు. ఆ తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇది కరెక్ట్ కాదని సూచిస్తున్నాం. వేడుక అందరూ ఒకేలా నిర్వహించాలని చెబుతున్నాం.

– ఆత్రం జలపతిరావు,
కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు

సంప్రదాయం ప్రకారమే..



వివాహాలు సంప్రదాయ బద్ధంగా చేయడం మంచిది. ఆడంబరాలకు పోవద్దు. అప్పులు చేసి వివాహాలు చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు. అందుకే గ్రామాలు, తండాల్లో వివాహ వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్నాం. ఖర్చు తగ్గించేందుకు సంప్రదాయం ప్రకారమే వివాహాలు జరిపించాలని సూచిస్తున్నాం.

– పెందోర్ సుధాకర్,
పర్ధాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు

సమయానికే పెళ్లి చేసేలా..



చాలాచోట్ల ముహూర్తానికి వివాహాలు జరగడంలేదు. దీంతో బంధుమిత్రుల సమయం వృథా అవుతోంది. సమయం దాటి ఆలస్యంగా వివాహాలు జరగడం కారణంగా వధూవరుల కుటుంబీకులూ ఇబ్బందుల పాలవుతున్నారు. ఇక నుంచి ఆహ్వానపత్రికలో ముద్రించిన సమయానికే పెళ్లి తంతు జరిపించేలా అవగాహన గ్రామాల్లో కల్పిస్తున్నాం.

– పెందోర్ రాజేశ్వర్,
రాయిసెంటర్ సర్‌మోడి, జోడేఘాట్

న్యూస్‌రీల్

సిర్పూర్(టి) ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



చేతులెత్తి ఓటు వేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) ఎంపీపీ చునార్కర్ సువర్ణపై వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణపై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీతోపాటు ఎంపీటీసీ సభ్యులు సోహెల్ అహ్మద్, మంగిలాల్, తుకారాం, ఎల్ములే సరిత, కారం శైలజ, తాహెరాబేగం అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

కౌటాల: రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌటాలలోని జగదాంబ గార్డెన్స్‌లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించనున్న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధికసంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

అండర్ బ్రిడ్జి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ఇటీవల మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం పట్టణంలోని సంజీవయ్యకాలనీ వద్ద ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులకు నష్టం జరగకుండా ప్లాన్ తయారు చేస్తున్నామని చెప్పారు. రైల్వేలైన్ ఆవలి పట్టణవాసులు, పెద్దవాగు రోడ్డులోని మోక్షదాంకు అనుసంధానంగా ఈ రైల్వే అండర్ బ్రిడ్జి అవసరం ఉందని తెలిపారు. పట్టణాభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు దెబ్బటి శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలు



మొరం తవ్వుతున్న జేసీబీ

కెరమెరి: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ముకదంగూడ గ్రామానికి ఆనుకుని మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతోంది. బావి నిర్మాణానికే ఈ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. తవ్వకాలు జరుపుతున్న ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంది. తవ్వకాల కోసం అటవీ అధికారుల నుంచి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఇంత జరుగుతున్నా అటవీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

'పాల్వాయి'కి పరామర్శ



నివాళులర్పిస్తున్న నగేశ్, నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు నానమ్మ అండాలమ్మ ఇటీవల మరణించగా ఎమ్మెల్యేతోపాటు అతడి కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎంపీ, బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా అండాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకుడు దోని శ్రీశైలం తదితరులున్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం'



గుండాయిపేట్‌కు వచ్చిన వాటర్ ట్యాంకర్

సాక్షి ఎఫెక్ట్

కౌటాల: జిల్లాలోని పలు గ్రామాలకు సక్రమంగా తాగు నీరు సరఫరా చేయడం లేదని శనివారం గ్రౌండ్ రిపోర్టులో భాగంగా 'సాక్షి'లో ప్రచురించిన 'తాగునీటి కటకట' కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మండలంలోని తుమ్మిడిహెట్టి పంచాయతీ పరిధి జనగాం, గుండాయిపేట్ గ్రామాలను ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శేని తిరుపతి, సీహెచ్ తిరుపతి పరిశీలించారు. నీటి సమస్య ఉన్న కాలనీలను గుర్తించారు. జనగాంలోని ఎస్టీ కాలనీకి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే పైపుల వద్ద లీకేజీలు ఉండడంతో మరమ్మతు చేయించి నీటిని సరఫరా చేశారు. గుండాయిపేట్‌లోని బీసీ, ఎస్సీ కాలనీలకు జీపీ ట్రాక్టర్‌తో నీటిని పంపిణీ చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

అందరూ ఓటు వినియోగించుకోవాలి



2కే రన్‌ను ప్రారంభిస్తున్న దీపక్ తివారి

కాగజ్‌నగర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం పట్టణంలోని తెలంగాణతల్లి చౌరస్తా నుంచి ఎస్పీఎం గ్రౌండ్ వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా చేపట్టిన 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కళాజాత, ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపర్చాలని పేర్కొన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1950కు లేదా సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఉపాధ్యాయులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్: లోకసభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి వికాస్‌రాజ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉంటుందని వివరించారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ జారీ కోసం సిబ్బంది వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలను ఎస్‌బీసీ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, కాశబోయిన సురేశ్, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ప్రిన్సిపాల్‌లను తొలగించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న వారిని వెంటనే తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌లను నియమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌లను నియమించాలని శనివారం జిల్లా కేంద్రంలో డీఎండబ్ల్యూ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ అండదండలతో పలువురు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ అవుతున్నారని ఆరోపించారు. గురుకులాల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్ఎల్‌సీ పేరుకే ఉన్నారని, గురుకులాల్లో నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంలేదని విమర్శించారు. విద్యార్థులను పట్టించుకోని ఆర్ఎల్‌సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎల్‌సీ ప్రిన్సిపాల్‌లతో కుమ్మక్కై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సెక్రటరీ ఇస్తున్న ఆదేశాలను నామమాత్రంగా పాటిస్తూ తప్పుదోవ పట్టిస్తున్న అధికారుల కారణంగా రూ.లక్షల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్నాయని తెలిపారు. హెచ్‌ఆర్‌తో ప్రభుత్వానికి సుమారు రూ.30లక్షల నష్టం జరుగుతోందని, రికవరీ జరగకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్న కొందరు అధికారులు ఆర్ఎల్‌సీ, విజిలెన్స్ అధికారులపై చర్య తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో నాయకుడు దినకర్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులంతా ఓటేయాలి

ఆసిఫాబాద్: లోకసభ ఎన్నికల్లో అర్హులంతా ఓటు వేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద 5కే రన్‌ను అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ శాతాన్ని పెంచేలా కళాజాత, ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు చెప్పారు. స్వీప్‌లో భాగంగా ఓటు వినియోగం, ప్రాముఖ్యతపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 01.04.2024 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఏప్రిల్ 15వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1950 లేదా సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అంతకుముందు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

చి'వరి'కి పొల్లే..!

- కోత దశలోనూ వీడని తెగుళ్లు
- నారుమడి నుంచి అవే చీడలు
- దిగుబడిపై రైతుల దిగులు



పీపీరావుకాలనీ శివారులో పొల్లు పోయిన వరి పైరు

దహెగాం: ఆది నుంచీ వరి పైరును తెగుళ్లు పట్టి పీడిస్తున్నాయి. నారుమడి దశ నుంచి మొదలై కోత దశలోనూ వీడడం లేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండడం లేదు. పంట పొల్లు పోతుండడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. రూ.వేలకువేలు ఖర్చు చేసినా ప్రయోజనం కనిపించడం లేదని వాపోతున్నారు. ఖరీఫ్ కలిసి రాకపోవడంతో యాసంగిపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు నిరాశే మిగిలేలా ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా తెగుళ్లు వీడక దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

3–4 సార్లు పిచికారీ చేసినా..

ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 18వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. ప్రాజెక్టులు, బోర్ల కింద సాగు చేసిన వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. మరికొన్ని చోట్ల గింజలు పాలు పోసుకునే దశలో ఉంది. మరో 10–20 రోజుల్లో కోత దశకు చేరనుంది. ఈ సీజన్‌లో నారుమడి నుంచి పొట్ట దశ దాకా వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. ముందుగా నాటు వేసిన వరిని మొగి పురుగు వెంటాడింది. అదే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జింకుధాతు లోపం ఏర్పడింది. పంటలను కాపాడుకోవడానికి ఎన్ని మందులు పిచికారీ చేసినా మరోసారి అగ్గి తెగులు ఆశించింది. దీంతో వరి పొల్లు పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ తెగుళ్లను నివారించుకోవడానికి రైతులు చేసిన ఖర్చు తడిసి మోపెడైంది. ఒక్కో రైతు మూడు నుంచి నాలుగుసార్లు పురుగు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. అయినా తెగుళ్లు వెంటాడుతున్నాయి.

కోత దశలో అకాల వర్షాల భయం

వరి కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాలతోనూ నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని రైతులు వాపోతున్నారు. ప్రతీ సీజన్‌లో ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రతీ సీజన్‌లో ఒకే రకం విత్తనం సాగు చేయకుండా పంట మార్పిడి పద్ధతి పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నా రైతులు పెడచెవిన పెడుతున్నారు. ఒకే రకం విత్తనాలను తరచూ సాగు చేస్తుండడంతోనే తెగుళ్లు ఆశిస్తున్నట్లు వారు చెబుతున్నారు.

పంటమార్పిడి చేయాలి

వరి సాగు చేస్తున్న రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి. గ్రామస్థాయిలో ఏఈవోలు అందుబాటులో ఉంటారు. అగ్గి తెగులు నివారణకు తరచూ పొలంలో నీరు మార్చాలి. టిబ్యూకోనాజోల్ 1.0 ఎంఎల్ లీటర్ నీటిలో, ట్రిసైక్లాజోల్ 0.6 గ్రాములు పౌడర్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఒకే రకం విత్తనాన్ని తరచూ సాగు చేయకుండా పంట మార్పిడి విధానం పాటిస్తే తెగుళ్లు ఆశించవు.

– వంశీకృష్ణ ఏవో, దహెగాం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కొనుగోళ్లపై సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తారామణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ నర్సింహారావుతో కలిసి కొనుగోళ్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏప్రిల్ ఒకటిన మండలానికో కేంద్రం ఏర్పాటు చేయాలని, వరి కోతలు ప్రారంభమయ్యేలోపు మిగతా కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు సరిపడా తెప్పించాలని తెలిపారు. రైతులు తప్పతాలు, మట్టి గడ్డలు, తేమ శాతం ఇతర అంశాలు పాటించి ధాన్యం తేవాలని సూచించారు. తూకం జరిగిన వెంటనే ధాన్యం రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధాన్యం రవాణా సమయంలో ఎగుమతి, దిగుమతి కోసం అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా అధికారులు, రైస్‌మిల్లుల యజమానులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో సహకార, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్‌: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిర్రకుంటకు చెందిన డొడ్డికార్‌ హీరాచంద్‌ (75) పట్టణంలో శనివారం జరిగే వారసంతలో సరుకులు కొనేందుకు కలెక్టరేట్‌ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా దహెగాం మండలంలోని లగ్గం గ్రామానికి చెందిన కుమ్మరి శివ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు రెఫర్‌ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు గులాబ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


భీంరావు(ఫైల్‌)

రెబ్బెన(ఆసిఫాబాద్‌): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గజ్జిన భీంరావు (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏపనీ చేయకుండా ఇంటివద్ద ఖాళీగానే ఉంటున్నాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. జీవితంపై విరక్తి చెందిన భీంరావు శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్‌: ఒంటరి తనం భరించలేక మనస్తాపానికి గురై డిగ్రీ విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది.. ఎస్సై మనోహర్‌ వివరాల ప్రకారం.. మండలంలోని లక్కెట్టిపేట గ్రామానికి చెందిన మేఘశ్యాం కుమారుడు అర్క వినోద్‌ (23) ఉట్నూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో వారు శుభకార్యానికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా వినోద్‌ దూలానికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి సోదరుడు గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి

జైనథ్‌: మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన కాట్పెల్లి వామన్‌ రెడ్డికి చెందిన ఎద్దు మేతకు వెళ్లి విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. స్థానికులు బాధితుల కథనం మేరకు... వామన్‌రెడ్డి ఎద్దు సాంగ్వి శివారులోని పూండ్రు ప్రవీణ్‌ చేనులో మేతమేస్తున్నాయి. చేను గట్టు మీద మేతమేస్తుండగా ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. సుమారు రూ.50వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో లబోదిబోమన్నాడు. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

కేవీలో ప్రవేశాలకు వేళాయె..!

- ఏప్రిల్‌ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఒకటో తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 15 వరకు గడువు
- 2 నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలు ఉంటేనే అడ్మిషన్లు



మంచిర్యాల కేంద్రీయ విద్యాలయ భవనం

మంచిర్యాలఅర్బన్‌: కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ) ప్రవేశాలకు వేళయ్యింది. ఏప్రిల్‌ 1 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి కేవీలో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ జారీ చేశారు. ఏప్రిల్‌ 1 నుంచి 15 వరకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్‌ 10 వరకు రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలను బట్టీ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మంచిర్యాల కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌ ప్రసాద్‌ తెలిపారు.

రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు

కేంద్రీయ విద్యాలయాల్లో తరగతికి 40 చొప్పున సీట్లు ఉంటాయి. ఈ ఏడాది సీట్లు కుదించారు. ఒకటో తరగతిలో నూతనంగా చేరే విద్యార్థులతో 32 సీట్లు మాత్రమే భర్తీ చేయనున్నారు. మిగిలిన 8 సీట్లను కేవీ టూ కేవీ (ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే వారితో) సీట్ల కేటాయింపు జరగనుంది. జాతీయ విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద ఇదివరకు 10 సీట్లకు గానూ 8 సీట్లు కుదించారు. ఎస్సీలకు 6 నుంచి 5 కు, ఎస్టీలకు 3 నుంచి 2, ఓబీసీలకు 11 నుంచి 8 సీట్లకు కుదించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగంలో పనిచేసే వారికి ప్రవేశాల్లో తొలి ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర అనుబంధ సంస్థలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అనుబంధ సంస్థల ఉద్యోగులకు కేటాయిస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి kvson lineadmission.kvs.govt.in లేదా kvs sangathan.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ వెబ్‌సైట్‌లో ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది.

దరఖాస్తుల స్వీకరణ ఇలా..

ఒకటో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్‌ 1నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఈ నెల 10 వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకటో తరగతిలో ప్రవేశానికి 2024 మార్చి 31 నాటికి ఆరు నుంచి ఎనిమిదేళ్ల వయస్సు, రెండో తరగతిలో ప్రవేశానికి ఏడు నుంచి తొమ్మిదేళ్ల వరకు, మూడో తరగతిలో ప్రవేశానికి ఎనిమిది నుంచి పదేళ్ల వరకు, నాలుగో తరగతిలో ప్రవేశానికి తొమ్మిది నుంచి పదకొండేళ్ల వరకు, ఐదో తరగతిలో ప్రవేశానికి పదేళ్ల నుంచి పన్నెండేళ్ల వరకు, ఆరో తరగతిలో ప్రవేశానికి పదకొండు నుంచి పదమూడేళ్ల వరకు, ఏడో తరగతిలో ప్రవేశానికి పన్నెండు నుంచి పద్నాలుగు, ఎనిమిదో తరగతిలో ప్రవేశానికి పదమూడు నుంచి పదిహేనేళ్లు, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పద్నాలుగు నుంచి పదిహేనేళ్ల వరకు వయస్సు ఉండాలని సూచించారు. సీబీఎస్‌ఈ సిలబస్‌లో కేంద్రీయ విద్యాలయాల్లో బోధన ఉంటుంది. పిల్లలపై ఎటువంటి ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్య అందించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ ప్రసాద్‌ కోరారు.

రిమ్స్‌లో వైద్యుల నిర్లక్ష్యం


స్ట్రెచర్‌పై పడుకుని ఉన్న రోగి

ఆదిలాబాద్‌టౌన్‌: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్న రిమ్స్‌ వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. బేల మండలంలోని ఏటి గ్రామానికి చెందిన కోయిరే నత్తు తన రెండు కాళ్ల పక్షవాతంతో పనిచేయకపోవడంతో కుటుంబీకులు రిమ్స్‌ ఆసుపత్రికి ఉదయం 10 గంటలకు తీసుకువచ్చారు. అంబులెన్స్‌ సిబ్బంది అత్యవసర విభాగం వద్ద స్ట్రెచర్‌లో దించి వెళ్లారు. ఎమర్జెన్సీ వార్డులోని సిబ్బంది పాత భవనంలోకి తీసుకెళ్లాలని కుటుంబీకులకు సూచించారు. దీంతో రోగిని అక్కడికి తీసుకెళ్లగా ఇక్కడ కాదని అక్కడికే వెళ్లాలని తిప్పి పంపించారు. ఆ తర్వాత రిమ్స్‌లోని సిబ్బందికి చెప్పినా ఎవరు పట్టించుకోకుండా గంటల తరబడి తిప్పించారని బాధిత కుటుంబీకులు వాపోయారు. చివరకు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బేల యువజన కాంగ్రెస్‌ నాయకుడు సామ రూపేష్‌రెడ్డి రిమ్స్‌ డైరెక్టర్‌ను సంప్రదించడంతో డైరెక్టర్‌ ఆదేశాల మేరకు సిబ్బంది బాధితుడిని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గంటల తరబడి స్ట్రెచర్‌లోనే పడుకున్నప్పటికీ వైద్యం అందకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

సమష్టి కృషితోనే లక్ష్యసాధన


ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): సమష్టి కృషితోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని శ్రీరాంపూర్‌ జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఆర్కే న్యూటెక్‌ గని ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించిన సందర్భంగా శనివారం గనిపై ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి గని ఉత్పత్తి లక్ష్యం 1.6 లక్షల టన్నులు సాధించాల్సి ఉండగా రెండు రోజుల ముందుగానే ఈ లక్ష్యాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను జీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్‌ ఏజెంట్‌ రాముడు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్‌ కార్యదర్శి బాజీ సైదా, గని మేనేజర్‌ స్వామి రాజు, గ్రూపు ఇంజినీర్‌ రాజా రవిచరణ్‌, రక్షణాధికారి కొట్టే రమేశ్‌, వెంటిలేషన్‌ అధికారి చంద్రమౌళి, యూనియన్‌ నాయకులు ఆకుల లక్ష్మణ్‌, తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఆశీర్వాదం.. గ్రామస్తుల ఘనస్వాగతం


తల్లి కాళ్లకు మొక్కుతున్న సుగుణ

జన్నారం: కాంగ్రెస్‌ పార్టీ నుంచి ఎంపీ టికెట్‌ కేటాయించడంతో హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆత్రం సుగుణ శుక్రవారం రాత్రి జన్నారం మండలం తిమ్మాపూర్‌లో ఉన్న పుట్టినింటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేరుగా తల్లి బూదమ్మ వద్దకు వెళ్లి కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురయ్యారు. అమ్మను చూసి కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం తల్లిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆమె మాట్లాడుతూ తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, మీరంతా ఆశీర్వదించి గెలిపించాలని, పుట్టిన ఊరు రుణం తీర్చుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు చంద్రయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం


శౌరి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆస్పత్రి, మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన డెప్యూటీ సీఎంవో, ఇరువురు కార్మికులను శనివారం ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఘనంగా సన్మానించారు. డెప్యూటీ సీఎంవో శౌరి, స్వీపింగ్‌ మజ్దూర్‌ చిలుముల శంకరమ్మ, శాంతిఖని గని వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిట్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బోళ్ల వెంకట సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో గని మేనేజర్‌ సంజయ్‌కుమార్‌సిన్హా, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్‌, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌, సెక్రెటరీ సోకాల శ్రీనివాస్‌, సంయుక్త కార్యదర్శి వినయ్‌, పిట్‌ సెక్రెటరీ ఉమారాణి, రక్షణాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న జైపాల్‌సింగ్‌

పాతమంచిర్యాల: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్‌ జిల్లా జాయింట్‌ కన్వీనర్‌ జైపాల్‌ సింగ్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు, మేధావులను ప్రశ్నించే వారిపై ఉపా చట్టాలను ఆపాదించి జైళ్లలో నిర్బంధించడం అన్యాయమన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోకర్ల శంకర్‌, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఆర్‌సీటీ నాయకులు జయరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు భరోసా


చిన్నారుల ఇంటివద్ద అధికారులు

సాక్షి ఎఫెక్ట్‌..

మందమర్రిరూరల్‌: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన చిన్నారులపై శనివారం 'నాడు తండ్రి.. నేడు తల్లి మృతి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం డీసీపీవో ఆనంద్‌, జిల్లా ఎడ్యుకేషన్‌ సెక్టోరియల్‌ అధికారి ఏఎస్‌ఎన్‌ మూర్తి, మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మొదటి జోన్‌లోని ఆర్తీక్‌, కార్తీక్‌ అనే చిన్నారుల ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. వారిని ఉన్నత చదువులు చదివిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేముసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్‌, నాయకులు నర్సింగ్‌, అనిల్‌, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి


మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం నస్పూర్‌ కాలనీలోని యూనియన్‌ కార్యాలయంలో మాట్లాడుతూ గనుల వారీగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పిట్‌ కమిటీలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ బ్రాంచి ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్‌, నాయకులు నక్క సుమన్‌, రెడ్డపాక లక్ష్మణ్‌, అందె వెంకటేశ్‌, గునిగంటి నర్సింగరావు, వాసు, శెట్టి శంకరయ్య, మహేందర్‌, కమల్‌, వెంకటేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

లాస్ట్‌ డ్యూటీ సార్‌.. లేదు పోయిరా..!

- చర్చనీయాంశంగా డ్రైవర్‌, అధికారి సంభాషణ

మంచిర్యాలఅర్బన్‌:

ఆర్టీసీ డ్రైవర్‌: సార్‌ నమస్తే.. రేపు, ఎల్లుండి బస్టాండ్‌లో డ్యూటీ ఇవ్వరా?

అధికారి : ఏమీ లేదు. ఏమీ లేదు.

డ్రైవర్‌: లాస్ట్‌ డ్యూటీ కదా సర్‌ (రిటైర్‌మెంట్‌ కదా)

అధికారి: శనివారం, ఆదివారం ఉంటుంది కదా.. పోయిరా..

డ్రైవర్‌: ఆదివారం ఆఫ్‌ కదా సార్‌..

అధికారి : లేదు.. శనివారం ఇన్‌కమింగ్‌లో ఉంటా వు.. డ్రైవర్లు లేరు.. బస్టాండ్‌లో ఇచ్చేతట్టు లేదు.. డ్యూటీ చేసుకో..లాస్ట్‌ అయినా డ్యూటీకి పోయిరా..

డ్రైవర్‌: రోజులు బాగాలేవు సార్‌.. బస్టాండ్‌లో ఎక్కడైనా ఇయ్యండి అంటూ వేడుకుంటున్న సంభాషణ చర్చానీయంశంగా మారింది. గతంలో పదవీ విరమణకు ఒకరోజు ముందు డ్యూటీకి వెళ్లిన ఓ డ్రైవర్‌ అనుకోని ప్రమాదం జరిగి సస్పెండ్‌కు గురైతే లావాదేవీలన్నీ ఆగిపోయాయి. ఇలాంటి సంఘటనలు దృష్టిలో ఉంచుకున్న కార్మికుడు ఈ నెల 29న బస్టాండ్‌లో డ్యూటీ ఇవ్వమని ఎంత మొరపెట్టుకున్నా విధులకు పంపించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్పెషల్‌ ఆఫ్‌ ఇస్తే డ్రైవర్‌కు కూడా బాగుండేదనే అభిప్రాయాలు లేకపోలేదు. ఎంతోమంది ఓడీల పేరిట విధులకు ఎగనామం పెడుతున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. సిబ్బంది కొరత వాస్తవమే కానీ (రూల్స్‌ ఒప్పుకోకున్నా మానవతాదృక్పథంతో) ఒకరోజుతో వచ్చేది ఏమీలేదు కదా.. పదవీ విరమణ పొందే కార్మికునికి తప్పనిసరి డ్యూటీ వేయడంపై కార్మికులు పెదవి విరుస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


భోజన్న మృతదేహం

నర్సాపూర్‌ (జి): మండలంలోని అర్లి(కె) ఎక్స్‌ రోడ్డు వద్ద గుర్తు తెలియని ట్రాక్టర్‌ ట్రాలీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం... లోకేశ్వరం మండలం బాగాపూర్‌ గ్రామానికి చెందిన మాదరి భోజన్న(50) ద్విచక్ర వాహనంపై శుక్రవారం పని నిమిత్తం రాంపూర్‌ గ్రామానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం బాగాపూర్‌ వెళ్తుండగా రాత్రి అర్లి(కె) ఎక్స్‌ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్‌ డ్రైవర్‌ బ్రేక్‌ వేయడంతో వెనుక ట్రాలీకి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో భోజన్న తలకు బలమైన గాయమైంది. స్థానికులు అంబులెన్స్‌లో భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శనివారం అతడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- బైక్‌, బొలెరో ఢీకొని ఇద్దరు దుర్మరణం


సుదర్శన్‌ మృతదేహం


సుదర్శన్‌ (ఫైల్‌)


రక్షిత్‌ (ఫైల్‌)

జన్నారం(ఖానాపూర్‌): వివాహానికి వెళ్లివస్తూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తిరిగిరాని లోకాలకు వెళ్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మృత్యుంజయ సర్కార్‌ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం రేండ్లగూడకు చెందిన దేవి సుదర్శన్‌ (45) కొంతకాలంగా జగిత్యాలలోని అటవీశాఖలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. శనివారం దండేపల్లి మండలం లింగాపూర్‌లో తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న పెండ్లికి హాజరయ్యేందుకు రేండ్లగూడకు చెందిన తమ అన్న కుమారుడు దేవి రక్షిత్‌ (22)తో కలిసి బైక్‌పై బయలుదేరారు. తిరుగుప్రయాణంలో జన్నారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌ సమీపంలో జన్నారం నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టారు. ఘటనలో సుదర్శన్‌ అక్కడికక్కడే మృతి చెందగా రక్షిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుదర్శన్‌కు భార్య రాజేశ్వరి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. రక్షిత్‌ తండ్రి రాజం బెల్లంపల్లిలో హెడ్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం సేకరణకు సిద్ధం

- ఏప్రిల్‌ మొదటి వారంలో ప్రారంభం
- 1.74 లక్షల మెట్రిక్‌ టన్నుల సేకరణ లక్ష్యం
- జిల్లాలో 245 కొనుగోలు కేంద్రాలు


ధాన్యం సేకరణ (ఫైల్‌)

మంచిర్యాలఅగ్రికల్చర్‌: యాసంగి వరిధాన్యం సేకరణకు జిల్లా అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఏప్రిల్‌ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్‌ 1న అదనపు కలెక్టర్‌, పౌరసరఫరాల, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయా ఏజెన్సీల అధికారులు, రైస్‌మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. తదనంతరం మరో రెండు మూడు రోజుల్లో వివిధ ఏజెన్సీల ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఆయా మండలాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం తరలించేందుకు మిల్లర్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చిస్తారు.

సేకరణ లక్ష్యం

జిల్లాలో గతేడాది 1,04,270 ఎకరాల్లో వరి సాగు కాగా 1,86,113 మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. ఈ ఏడాది 1,00,988 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా 2 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. విత్తన కంపెనీలు, రైతుల అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు 1.74లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్‌ రకం క్వింటాల్‌కు రూ. 2203, సాధారణ రకానికి రూ.2,183 ధర నిర్ణయించారు. తేమ శాతం 17 మించకుండా, చెత్తాచెదారం, తాలుతప్ప, మట్టిబెడ్డలు, రాళ్లు ఒక శాతం కన్నా ఎక్కువగా ఉండకుండా, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం 5 శాతం, పూర్తి కానీ, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడి ఆలస్యం..

ఈ ఏడాది వానాకాలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల ధాన్యం దిగుబడి ఆలస్యం కానుంది. ప్రస్తుతం జన్నారం, దండేపల్లి, చెన్నూర్‌ మండలాల్లో దిగుబడి దశకు చేరుకుంటుండగా మిగతా మండలాల్లో పంట పొట్టదశలోనే ఉంది. ఏప్రిల్‌ చివరిలో దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

245 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 245 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో పీఏసీఎస్‌ 110, ఐకేపీ 109, డీసీఎమ్మెస్‌ 26 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాయి. జియో ట్యాగింగ్‌ ద్వారా కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఎప్పటికప్పుడు ఏరియాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. దిగుబడికి అనుగుణంగా 57 లక్షల గన్ని బ్యాగులు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లాలో 19,68,270 గన్ని సంచులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్‌ రెండోవారం నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్‌ తెలిపారు.

వేర్వేరు చోట్ల నగదు పట్టివేత


కోటపల్లి: నగదు సీజ్‌ చేస్తున్న అధికారులు


కాసిపేట: నగదు అప్పగిస్తున్న పోలీసులు

కాసిపేట(బెల్లంపల్లి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాసిపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో రాష్ట్రీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.6,93,200 నగదు పట్టుబడినట్లు ఎస్సై ప్రవీణ్‌ తెలిపారు. వరంగల్‌కు చెందిన గంట మహేష్‌ రూ.1,20,700 తన బొలెరో వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నారు. వరంగల్‌కు చెందిన జరుకుల అమృ రూ.2,75,000 తన వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నారు. దండేపల్లికి చెందిన మడిపల్లి వెంకటేశ్‌ రూ.2,97,500 తరలిస్తుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మొత్తం రూ.6,93,200 స్వాధీనం చేసుకుని ఎస్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రాపన్‌పల్లిలో రూ.1,82,500

కోటపల్లి(చెన్నూర్‌): మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1,82,500 నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఎస్‌టీ అధికారి పొన్న మల్లయ్య తెలిపారు. మహారాష్ట్రలోని అంకిసా గ్రామానికి చెందిన కొతారి ధర్మయ్య ఎలాంటి ఆధారాలు, రశీదులు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. నగదు సీజ్‌ చేసి కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.